సాక్షి
వైఎస్ఆర్ జిల్లా

గురువారం । 5 । జనవరి । 2023



అంధ విద్యార్థుల ప్రతిభను వెలికితీయడమే ధ్యేయం

అంధ విద్యార్థుల్లో ప్రతిభను వెలికి తీయడమే ధ్యేయమని వికలాంగులు, వయోవృద్ధుల సంక్షేమశాఖ డైరెక్టర్ అన్నారు. - 8లో



సెంచూరీ ప్లైవుడ్ పరిశ్రమ నిర్మాణ పనుల పరిశీలన

గోపవరం మండలంలోని సెంచూరీ ప్లైవుడ్ పరిశ్రమ నిర్మాణ పనులను ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి పరిశీలించారు. - 8లో

వాతావరణం

గరిష్టం/కనిష్టం
30.5/18.4

జిల్లాలో బుధవారం 18.4 – 30.5 డిగ్రీల మధ్య ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. గంటకు 1.8 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచాయి.

-కడప అగ్రికల్చర్

న్యూస్‌రీల్

దరఖాస్తుల ఆహ్వానం

కడప కోటిరెడ్డిసర్కిల్ : ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో మైదుకూరు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో స్కిల్ హబ్ సెంటర్‌లో డొమెస్టిక్ డేటా ఎంట్రీ ఆపరేటర్, రీటైల్ సేల్స్ అసోసియేట్ శిక్షణకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నామని జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి నాగార్జున దాసరి ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కోర్సుల్లో మూడు నెలలపాటు శిక్షణ ఇచ్చి ఉపాధి అవకాశాలు చూపుతామన్నారు. మైదుకూరు మండలంతో పాటు చుట్టుపక్కల ఉన్న నిరుద్యోగ యువత ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన తెలిపారు. డొమెస్టిక్ డేటా ఎంట్రీ ఆపరేటర్ కోర్సుకు ఇంటర్ ఆపైన.. రీటైల్ సేల్స్ అసోసియేట్‌కు పదో తరగతి, ఇంటర్ చదివిన అభ్యర్థులు అర్హులన్నారు. ఆసక్తిగల వారు తమ వివరాలు రిజిస్ట్రేషన్ చేసుకోవాలని, ఇతర వివరాలకు 97018 01902, 97046 58087 నంబర్లలో సంప్రదించాలన్నారు.

జిల్లా ఆస్పత్రిని పరిశీలించిన కేంద్ర బృందం



డీసీహెచ్‌ఎస్‌తో మాట్లాడుతున్న నీతి అయోగ్ అధికారి డాక్టర్ సందేశ్

ప్రొద్దుటూరు క్రైం: ప్రొద్దుటూరులోని జిల్లా ఆస్పత్రిని ఢిల్లీ నుంచి వచ్చిన నీతి అయోగ్ అధికారి డాక్టర్ సందేశ్ బృందం మంగళ, బుధవారం రెండు రోజుల పాటు ఆస్పత్రిని పరిశీలించారు. ఆస్పత్రిలోని అన్ని రికార్డులను పరిశీలించి హెచ్ఎంఐఎస్ ఆన్‌లైన్ పోర్టల్‌లో పొందు పరిచిన వివరాలు రికార్డుల్లో సరిగా ఉన్నాయా లేదా అని సరి చూశారు. ఆస్పత్రిలోని ఎమ్మార్ఐ, సిటి స్కానింగ్, డయాలసిస్, ఎక్స్‌రే విభాగాలతో పాటు ఫార్మసీ, ల్యాబ్, అన్ని వార్డులను పరిశీలించారు. వాటికి సంబంధించిన వివరాలను మెడికల్ సూపరింటెండెంట్ ఆనంద్‌బాబును అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో డీసీహెచ్ఎస్ హిమాదేవి, జిల్లా గణాంక అధికారి జార్జి, ఏఎస్ఓ జాకోబ్, ఆర్ఎంఓ రూపానంద్, వైద్యులు, స్టాఫ్ నర్సులు పాల్గొన్నారు.

- జిల్లాకు మంజూరైన 15 మల్టీపర్పస్ ఫెసిలిటీ సెంటర్లు
- జిల్లా వ్యాప్తంగా రూ. 6.40 కోట్లతో సాగుతున్న పనులు
- రెండు గోడౌన్ల పనులు పూర్తి.. వివిధ దశల్లో మిగతా పనులు
- ఏప్రిల్ చివరి నాటికి పనులు పూర్తి లక్ష్యంగా అడుగులు

రైతుకు భరోసా.. పంటకు భద్రత



తిప్పలూరులో పూర్తయిన మల్టీపర్పస్ ఫెసిలిటేషన్ సెంటర్ పనులు

కడప అగ్రికల్చర్: ఎండనక, వాననక ఆరుగాలం శ్రమించే రైతన్నలకు రాష్ట్ర ప్రభుత్వం అండగా నిలుస్తోంది. ఇప్పటికే గ్రామీణ ప్రాంతాల్లో రైతు భరోసా కేంద్రాలను ఏర్పాటు చేసి రైతులకు విత్తు నుంచి దిగుబడి వరకు కావాల్సిన అన్ని రకాల సేవలను అందిస్తోంది. దీంతోపాటు పెట్టుబడి సాయం కింద ప్రతి ఏటా రైతు భరోసా కింద రైతు ఖాతాలకు నగదును జమ చేస్తోంది. వీటన్నింటిని అందించిన ప్రభుత్వం రైతులు పండించిన పంట దిగుబడులను గిట్టుబాటు ధర వచ్చే వరకు భద్రంగా దాచుకునేందుకు వీలుగా రైతు భరోసా కేంద్రాలకు అనుసంధానంగా మల్టీ పర్పస్ ఫెసిలిటేషన్ సెంటర్లను నిర్మించి రైతులకు అండగా నిలుస్తోంది. దీంతో రైతులకు ఎలాంటి ఆందోళన లేకుండా నిశ్చింతగా పంటలను గోడౌన్లలో భద్రపరచుకుని గిట్టుబాటు ధర వచ్చినప్పుడు అమ్ముకునేందుకు వీలవుతుంది. ఒక్కో మల్టీపర్పస్ ఫెసిలిటీ సెంటర్‌ను రూ. 40 లక్షల పెట్టుబడితో 500 మెట్రిక్ టన్నుల ధాన్యం నిల్వ చేసుకునేందుకు వీలుగా వాటిని నిర్మిస్తున్నారు. ఇందులో 14 గోడౌన్లకు మాత్రం రూ. 40 లక్షలు కాగా కొండాపురంలో నిర్మించే గోడౌన్లను మాత్రం రూ. 80 లక్షలతో వెయ్యి మెట్రిక్ టన్నుల సామర్థ్యంతో నిర్మిస్తున్నారు. దీంతో అన్నదాతలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

జిల్లాకు 15 మల్టీపర్పస్ ఫెసిలిటీ సెంటర్ల మంజూరు: జిల్లా వ్యాప్తంగా 15 మల్టీపర్పస్ ఫెసలిటీ సెంటర్లను ప్రభుత్వం మంజూరు చేసింది. వీటి నిర్మాణానికి సంబంధించిన పనులను ప్రారంభించారు. ఇందులో ఒక్కో మల్టీపర్పస్ ఫెసిలిటి సెంటర్‌ను రూ. 40 లక్షలతో 50 సెంట్ల స్థలంలో నిర్మిస్తున్నారు. వీటిని రైతు భరోసా కేంద్రాల పరిధిలో సహకార సంఘాల ఆధ్వర్యంలో మార్కెటింగ్ శాఖ అధికారులు నిర్మిస్తున్నారు.

ఎక్కడెక్కడ నిర్మిస్తున్నారంటే..

జిల్లాలోని చెన్నంరాజుపల్లె, లింగాపురం, దువ్వూరు. కె. అగ్రహారం, పోరుమామిళ్ల, కొండాపురం, గోనుమాకులపల్లె, గడ్డంవారిపల్లె, నల్లింగాయపల్లె, వెల్లటూరు, వల్లూరు, నాగిరెడ్డిపల్లె, ముద్దనూరు, వద్దిరాల, తిప్పలూరులలో మల్టీపర్పస్ ఫెసిలిటేషన్ సెంటర్‌లను నిర్మిస్తున్నారు. ఇందులో తిప్పలూరు, వెల్లటూరులలో నిర్మించే గోడౌన్ నిర్మాణ పనులు పూర్తి అయ్యాయి. కొండాపురం, దువ్వూరు, ముద్దనూరు,గోనుమాకులపల్లె, వద్దిరాలల్లో నిర్మించే గోడౌన్ పనులు బేస్‌మట్టం దశలో ఉన్నాయి. కె. అగ్రహారం, నాగిరెడ్డిపల్లె, గడ్డంవారిపల్లె, చెన్నంరాజుపల్లె, లింగాపురలలో నిర్మించే గోడౌన్ పనులు పూతల దశలో ఉన్నాయి. మిగతా పనులు వివిధ దశల్లో ఉన్నాయి. ఏదిఏమైనా ఏప్రిల్ చివరికంతా పనులను పూర్తి చేసే దిశగా వేగంగా పనులు జరుగుతున్నాయి.

జిల్లాలో మంజూరైన మల్టీపర్పస్ ఫెసిలిటీ సెంటర్లు:	15
ఒక్కో దానికి మంజూరైన నిధులు :	రూ.40 లక్షలు
మంజూరైన మొత్తం నిధులు:	రూ. 6.40 కోట్లు
ఇప్పటివరకు పనులు పూర్తయినవి:	02
వివిధ దశల్లో పనులు జరుగుతున్న గోడౌన్లు:	13

ఏయే వసతులుంటాయంటే...

ఈ మల్టీపర్పస్ ఫెసిలిటీ సెంటర్‌లలో రైతులు పండించిన పంటలను ఆరబెట్టుకొనేందుకు వీలుగా ప్లాట్‌ఫాం ఏర్పాటు చేస్తారు. అలాగే ధాన్యాన్ని తెచ్చి అమ్ముకోవచ్చు. ఇందుకు సంబంధించిన ఏర్పాట్లు కూడా ఉంటాయి. అలా కాకుండా పంటలను అమ్ముకోని వారు తమ పంటలకు గిట్టుబాటు ధర వచ్చే వరకు ఈ మల్టీపర్పస్ ఫెసిలిటీ సెంటర్‌లలో భద్రపరుచుకోవచ్చు. ఇలా అన్ని రకాల వసతులతో వీటిని నిర్మిస్తున్నారు.

శరవేగంగా పనులు



మల్టీపర్పస్ ఫెసిలిటీ సెంటర్ పనులు జిల్లాలో శరవేగంగా జరుగుతున్నాయి. ఇందులో తిప్పలూరు, వెల్లటూరులో నిర్మించే గోడౌన్ పనులు పూర్తికాగా మిగతా చోట్ల బేస్‌మట్టం స్థాయితోపాటు పూతల దశకు వచ్చాయి. సంబంధిత పనులన్నింటిని త్వరితగతిన ఏప్రిల్ చివరి నాటికి పూర్తి చేసేందుకు కృషి చేస్తున్నాం. పనులు పూర్తయిన వెంటనే వాటిని సహకార సంఘాలకు అప్పగించి రైతులకు అందుబాటులోకి తీసుకువస్తారు.

– రామాంజనేయులు, మార్కెటింగ్‌శాఖ జాయింట్ డైరెక్టర్

సంక్షేమ హాస్టళ్లలో విద్యార్థుల సంరక్షణ ప్రధానం



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ విజయరామరాజు

కలెక్టర్ విజయరామరాజు

కడప సిటీ: సంక్షేమ హాస్టళ్లలో విద్యార్థులు ఎలాంటి వేధింపులకు గురి కాకుండా సొంత బాధ్యతతో సంరక్షించాలని సంక్షేమ అధికారులను, వార్డెన్లను కలెక్టర్ విజయరామరాజు ఆదేశించారు. బుధవారం స్థానిక కలెక్టరేట్ వీసీ హాలులో శిక్షణా కలెక్టర్ రాహుల్ మీనాతో కలిసి ఎస్సీ ఎస్టీ బీసీ సంక్షేమ అధికారులు, వార్డెన్లతో కలెక్టర్ సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సంక్షేమ హాస్టళ్లలో విద్యార్థులకు ఏమాత్రం కొరత లేకుండా చూడాలన్నారు. వారితో అసభ్యంగా ప్రవర్తించినా, లైంగిక, మానసిక వేధింపులకు గురి చేసినా ఎవరినీ ఉపేక్షించబోమని, కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. హాస్టల్ విద్యార్థుల మిస్సింగ్ కేసులు, మానసిక ఒత్తిళ్ల వంటి కేసులు నమోదైతే సంబంధిత అధికారులపై చర్యలు తప్పవన్నారు. నిర్ణీత సమయానికి హాస్టళ్లకు విద్యార్థులు చేరుకునేలా చర్యలు తీసుకోవాలన్నారు. హాస్టళ్లలో వాచ్‌మెన్లను కచ్చితంగా ఏర్పాటు చేసుకోవాలన్నారు. ఫిర్యా దు బాక్సులను ఏర్పాటు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో బీసీ సాంఘిక సంక్షేమశాఖ జేడీ జయప్రకాశ్, ఎస్సీ ఎస్టీ కార్పొరేషన్ ఈడీ వెంకట సుబ్బయ్య, మైనార్టీ బీసీ సంక్షేమశాఖ అధికారి బ్రహ్మయ్య తదితర అధికారులు, హాస్టల్ వార్డెన్లు పాల్గొన్నారు.

సమయానికి ముందే ఆరోగ్య కేంద్రంలో ఉండాలి

పదిహేను నిమిషాలకుముందే ఆరోగ్యకేంద్రాలకు చేరుకోవాలని వైద్యాధికారులకు కలెక్టర్ విజయరామరాజు సూచించారు. బుధవారం కలెక్టరేట్‌లోని సభా భవనంలో ట్రైనీ కలెక్టర్ రాహుల్‌మీనా, డీఎంహెచ్ఓ నాగరాజుతో కలిసి జిల్లాలోని అన్ని ఆరోగ్య కేంద్రాల్లో విధులు నిర్వర్తించే వైద్యాధికారులతో కలెక్టర్ సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భం ఆయన మాట్లాడుతూ క్రమం తప్పకుండా ప్రతిరోజు విధిగా ఆరోగ్య కేంద్రాలకు వెళ్లాలన్నారు. ఫ్యామిలీ ఫిజిషియన్ కాన్సెప్ట్‌ను జిల్లాలోని అన్ని మండలాల్లో సక్రమంగా అమలు జరిగేలా చర్యలు చేపట్టాలన్నారు. డిప్యూటీ డీఎంహెచ్ఓలు, పీహెచ్‌సీలు, యూపీహెచ్‌సీలు, సీహెచ్‌సీల వైద్యాధికారులు పాల్గొన్నారు.

లక్ష్య సాధనకు కృషి చేయాలి

ప్రభుత్వ పథకాల అమలులో నిర్దేశిత లక్ష్య సాధన దిశగా అడుగులు వేస్తూ ప్రతి అంశంలోనూ పురోగతి సాధించాలని కలెక్టర్ విజయరామరాజు క్షేత్రస్థాయి అధికారులను ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్ సభా భవనంలో డీఆర్వో గంగాధర్‌గౌడ్, ట్రైనీ కలెక్టర్ రాహుల్ మీనాలతో కలిసి జగనన్న హౌసింగ్ కాలనీల్లో గృహ నిర్మాణాల పనుల పురోగతి, మౌలిక వసతులు, జగనన్న సంపూర్ణ గృహహక్కు, ఓటీఎస్ తదితర అంశాలతోపాటు అభివృద్ధి పనులు, ప్రభుత్వ పథకాల అమలు తీరుపై ఆర్డీఓలు, నియోజకవర్గ, మండలస్థాయి అధికారులతో కలెక్టర్ సమీక్షించారు. ఆయన మాట్లాడుతూ ఇప్పటికీ ప్రారంభం కాని ఇళ్లన్నీ వెంటనే ప్రారంభించి పునాది స్థాయికి తీసుకు రావాలన్నారు. ఆర్డీఓలు ధర్మచంద్రారెడ్డి, వెంకట రమణ, శ్రీనివాసులు, వెంకటేశు, తహసీల్దార్లు, ఎంపీడీఓలు, మున్సిపల్ కమిషనర్లు పాల్గొన్నారు.

చెన్నూరు షుగర్ ఫ్యాక్టరీని పరిశీలించిన కలెక్టర్

చెన్నూరు: చెన్నూరు షుగర్ ఫ్యాక్టరీని జిల్లా కలెక్టర్ విజయరామరాజు బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం నుంచి కార్మికులకు రావాల్సిన పెండింగ్ బకాయిలు రూ. 13 కోట్ల 60 లక్షలు మంజూరయ్యాయన్నారు. ఈ మొత్తాలు కార్మికులు అందరూ తీసుకున్నారా? లేదా? అని అడిగి తెలుసుకున్నారు. శుక్ర, శనివారాల్లో కార్మికులందరికీ పంపిణీ చేస్తామని ఫ్యాక్టరీ యూనియన్ నాయకులు కలెక్టర్ దృష్టికి తీసుకు వచ్చారు. అనంతరం ఫ్యాక్టరీకి సంబంధించిన భూమి 227 ఎకరాలు ఉందని తహసీల్దార్ పఠాన్ అలీఖాన్ కలెక్టర్‌కు వివరించారు. ఇందులో ఐదు ఎకరాల వరకు ఆక్రమణకు గురైందని యూనియన్ నాయకుడు పసుపులేటి కృష్ణ చెప్పారు. దీనిపై స్పందించిన కలెక్టర్ ఈ విషయం పరిశీలించాలని తహసీల్దార్‌ను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఆర్డీఓ ధర్మచంద్రారెడ్డి, అధికారులు, ఫ్యాక్టరీ యూనియన్ నాయకులు పెంచల్‌రెడ్డి, రసూల్, పలువురు కార్మికులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

ఫిబ్రవరి 11న జాతీయలోక్ అదాలత్

కడప అర్బన్ : జిల్లాలో ఫిబ్రవరి 11న జాతీయ లోక్ అదాలత్ జరగనుంది. దీనిని సద్వినియోగం చేసుకుని సత్వర న్యాయం పొందాలని జిల్లా న్యాయసేవాధికారసంస్థ ఇన్‌చార్జి చైర్మన్, ఇన్‌చార్జి జిల్లా ప్రధాన న్యాయమూర్తి సీ.ఎన్. మూర్తి, డీఎల్ఎస్ఏ సెక్రటరీ, జడ్జి ఎస్. కవిత బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. జాతీయ న్యాయసేవాధికారసంస్థ న్యూఢిల్లీ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర న్యాయసేవాధికారసంస్థ వారి ఆదేశానుసారంగా జిల్లా న్యాయసేవాధికారసంస్థ ఆధ్వర్యంలో జిల్లావ్యాప్తంగా ఫిబ్రవరి 11న ఉదయం 10:30 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు జాతీయలోక్ అదాలత్ జరగుతుందన్నారు. మరింత సమాచారం కోసం 08562 258622, 95732 69640 నంబర్లలో సంప్రదించాలన్నారు. ఈమెయిల్ అడ్రస్: డిస్ట్రిక్ట్.ఇకోర్ట్స్.జీటవి.ఐఎన్/కెఏడిఏపిపిఏ...డిఎల్ఎస్ఏకెఏడిఅట్‌ది రేటాఫ్ జీమెయిల్.కామ్‌లో చూడాలన్నారు. ప్రతి ఒక్కరూ కోవిడ్–19 నియమావళిని తప్పనిసరిగా పాటించాలన్నారు.

రేపు జాబ్ మేళా

కమలాపురం : స్థానిక ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో శుక్రవారం ఏపీఎస్ఎస్‌డీసీ, ఎస్ఈఈడీఏపీ, ఎంప్లాయ్‌మెంట్ ఎక్స్ఛేంజ్ వారి ఆధ్వర్యంలో మెగా జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ శేషా చలపతి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ, సీడాప్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఈ జాబ్ మేళాకు కియా మోటర్స్ ఇండియా, షిర్డీ సాయి ఎలక్ట్రికల్స్, మెడ్ ప్లస్, ట్రియోవిజన్ కాంపోజిట్ టెక్నాలజీస్, హ్యూన్ డై మోబిస్, అపోలో ఫార్మసీ, గ్రీన్ టెక్ ఇండస్ట్రీస్, ఏఐఎల్, డిక్సన్, హెవెల్స్, కేఐఎంఎల్ వంటి ప్రముఖ కంపెనీలు వస్తున్నాయని ఆయన చెప్పారు. టెన్త్, ఇంటర్, డిగ్రీ, పీజీ, డిప్లమో అభ్యర్థులందరూ అర్హులన్నారు. మేళాకు హాజరయ్యే అభ్యర్థులు సర్టిపికెట్లతో పాటు బయోడేటా, ఆధార్, పాస్‌పోర్ట్ సైజు ఫోటోలతో హాజరు కావాలన్నారు. కమలాపురంతో పాటు సమీప ప్రాంతాల నిరుద్యోగులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన అందులో పేర్కొన్నారు. పూర్తి వివరాలకు 88867 77023, 99121 15622 నంబర్లలో సంప్రదించాలని అన్నారు.

అంధ విద్యార్థుల్లో ప్రతిభను వెలికితీయడమే ధ్యేయం



మాట్లాడుతున్న రాష్ట్ర వికలాంగులు, వయోవృద్ధుల సంక్షేమశాఖ డైరెక్టర్ బీమా రవిప్రకాష్‌రెడ్డి. చిత్రంలో సమగ్రశిక్ష జిల్లా అధికారి అంబవరం ప్రభాకర్‌రెడ్డి,నగర డిప్యూటీమేయర్ బండి నిత్యానందరెడ్డి తదితరుతుల

కడప ఎడ్యుకేషన్ : అంధ విద్యార్థుల్లో ప్రతిభను వెలికి తీసి ప్రోత్సహించడమే ధ్యేయమని ఏపీ రాష్ట్ర వికలాంగులు, వయోవృద్ధుల సంక్షేమశాఖ డైరెక్టర్ బీమా రవిప్రకాష్‌రెడ్డి పేర్కొన్నారు. బుధవారం కడప నగరంలోని ప్రభుత్వ అంధుల పాఠశాలలో లూయిస్ బ్రెయిలీ జయంతిని నేషనల్ ఫెడరేషన్ ఆఫ్ ది బ్లైండ్ సంస్థతో కలిసి నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన బీమా రవిప్రకాష్‌రెడ్డి మాట్లాడుతూ లూయిస్ బ్రెయిలీ ఫ్రాన్స్ దేశంలోని కుప్రే అనే మారుమూల గ్రామంలో జనిృంచారన్నారు.అంధుల కోసం ఆరు చుక్కలతో లిపిని రూపొందించారన్నారు. నేటి సమాజంలో ఎంతోమంది అంధ విద్యార్థుల జీవితాల్లో వెలుగులు నింపి వారి భవిష్యత్తుకు బాటలు వేశారన్నారు. రానున్న కాలంలో వికలాంగుల సంక్షేమశాఖ ద్వారా విభిన్న ప్రతిభావంతులకు వివిధ రకాల పరికరాలు, వసతులు కల్పించే విధంగా చర్యలు తీసుకుంటున్నామన్నారు. అంధ విద్యార్థులకు ప్రత్యేకంగా బ్రెయిలీ లిపితో కూడిన పుస్తకాలు, ట్యాబ్‌లను, స్కాలర్‌షిప్‌లు అందించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. విభిన్న ప్రతిభావంతులకు ఉద్యోగాలు, ప్రమోషన్లలో నాలుగుశాతం రిజర్వేషన్ అమలయ్యే విధంగా చూస్తామన్నారు. జిల్లా వికలాంగులు, వయో వృద్ధులశాఖ అసిస్టెంట్ డైరెక్టర్ కృష్ణకిషోర్ మాట్లాడుతూ విభిన్న ప్రతిభావంతులు, అంధుల కోసం ప్రత్యేక అవకాశాలను కల్పించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. జిల్లా సమగ్రశిక్ష ప్రాజెక్టు అధికారి అంబవరం ప్రభాకర్‌రెడ్డి మాట్లాడుతూ ప్రత్యేకంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కల్పిస్తున్న రిజర్వేషన్లు సద్వినియోగం చేసుకుని రానున్న కాలంలో విభిన్న ప్రతిభావంతులు మంచిస్థాయికి ఎదగాలని అన్నారు. నగరపాలక డిప్యూటీ మేయర్ బండి నిత్యానందరెడ్డి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం దివ్యాంగుల సంక్షేమం కోసం ఎన్నో పథకాలు అమలు చేస్తూ వారి జీవితాల్లో వెలుగులు నింపుతోందన్నారు. అనంతరం వివిధ పోటీల్లో ప్రతిభచాటిన విద్యార్థులకు బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో కెనరా బ్యాంకు చీఫ్ మేనేజర్ శ్రీకాంత్, దివ్యాంగుల అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు చిన్న సుబ్బయ్యయాదవ్, ప్రధానోపాధ్యాయులు శంకరయ్య, నేషనల్ ఫెడరేషన్ ఆఫ్ ది బ్లైండ్ కో ఆర్డినేటర్ రామసుబ్బయ్య, వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

సెంచూరీ ప్లైవుడ్ పరిశ్రమ నిర్మాణ పనుల పరిశీలన



సెంచూరీ ప్లైవుడ్ పరిశ్రమ పనులను ఎమ్మెల్యే విక్రమ్‌రెడ్డికి వివరిస్తున్న వైస్‌ప్రెసిడెంట్ త్రిహాల్

గోపవరం : గోపవరం మండలంలో ఏర్పాటు చేస్తున్న సెంచూరీ ప్లైవుడ్ పరిశ్రమ నిర్మాణ పనులను బుధవారం శ్రీపొట్టిశ్రీరాములు నెల్లూరు జిల్లా ఆత్మకూరు ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి పరిశీలించారు. పరిశ్రమ వైస్‌ప్రెసిడెంట్ త్రిహాల్‌తో ఇక్కడ జరుగుతున్న పనుల గురించి చర్చించారు. ప్రభుత్వ సహకారం ఉన్నందున పనులు వేగవంతంగా జరుగుతున్నాయని, అనుకున్న సమయానికి పరిశ్రమను అందుబాటులోకి తీసుకువస్తామని పరిశ్రమ వైస్‌ప్రెసిడెంట్ ఎమ్మెల్యేకు మీ సహకారం ఉంటే మరింత ముందుకు వెళతామన్నారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ మా ప్రాంతానికి చెందిన నిరుద్యోగులకు కూడా పరిశ్రమలో ఉద్యోగ అవకాశాలు కల్పించేలా చూడాలని ఆయన వైస్‌ప్రెసిడెంట్‌కు సూచించారు. ఈ ప్రాంతంలో పరిశ్రమను ఏర్పాటు చేయాలని స్థానిక ఎమ్మెల్సీ డీసీగోవిందరెడ్డి ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లడం, వెంటనే ఆయన అంగీకరించడం, అవసరమైన భూమిని సమకూర్చి శంకుస్థాపన చేయడం అన్నీ చకచకా జరిగిపోయాయని తెలిపారు. గత ప్రభుత్వం మాదిరి పరిశ్రమ ఏర్పాటుకు శంకుస్థాపన చేయడం, వదిలేయడం ముఖ్యమంత్రి వైఎస్‌జగన్‌మోహన్‌రెడ్డి నైజం కాదని, ఏదైనా మాట ఇచ్చారంటే అది నెరవేరి తీరాల్సిందేనని అన్నారు. ఇప్పటికే విద్యుత్ సౌకర్యంతో పాటు బ్రహ్మంసాగర్ నుంచి నీటి వసతి కల్పించేందుకు టెండర్లు కూడా పిలిచినట్లు చెప్పారు. పరిశ్రమ పూర్తయితే ఈ ప్రాంత నిరుద్యోగులకు ఉపాధి అవకాశాలు రావడంతో పాటు జామాయిల్ వేసే నెల్లూరు, ప్రకాశం జిల్లాల రైతులకు కూడా ఎంతగానో ఉపయోగం ఉంటుందని తెలిపారు.

600 లీటర్ల బెల్లం ఊట ధ్వంసం



బెల్లం ఊటను ధ్వంసం చేస్తున్న సీఐ వెంకటేశ్వర్లు

వేంపల్లె : మండలంలోని బక్కన్నగారిపల్లె గ్రామ శివారు ప్రాంతంలో 600లీటర్ల బెల్లం ఊటను ధ్వంసం చేసినట్లు వేంపల్లె సీఐ వెంకటేశ్వర్లు తెలిపారు. జిల్లా ఎస్పీ అన్బురాజన్ ఆదేశాల మేరకు బుధవారం అక్రమ మద్యం, నాటుసారా తయారీ స్థావరాలపై సిబ్బందితో కలిసి దాడులు నిర్వహించారు. 600లీటర్ల బెల్లం ఊటను ధ్వంసం చేసి 10లీటర్ల నాటుసారాను స్వాధీనం చేసుకున్నారు. నాటుసారా తయారీకి పాల్పడిన వెంకటయ్యను అరెస్టు చేసి కేసు నమోదు చేసినట్లు సీఐ వెల్లడించారు. కార్యక్రమంలో ఎస్ఐ తిరుపాల్ నాయక్, ఎస్‌బీ హెడ్ కానిస్టేబుల్ రమణారెడ్డి, కానిస్టేబుల్ శివ చైతన్య తదితరులు పాల్గొన్నారు.

పోలీసుల అదుపులో యువకులు

మదనపల్లె : నడిరోడ్డుపై వీరంగం సృష్టిస్తూ యువకుడిపై దాడిచేసి గాయపరిచిన ఘటనలో నిమ్మనపల్లెకు చెందిన ఆరుగురు యువకులను అదుపులోకి తీసుకున్నట్లు టూటౌన్ సీఐ మురళీకృష్ణ తెలిపారు. యువతి విషయమై ఇరువర్గాల మధ్య గొడవ జరగడంతో ఒక వర్గానికి చెందిన యువకులు మరో వర్గంలోని ఇద్దరిపై దాడి చేశారన్నారు. వీటిని స్థానికంగా కొందరు సెల్‌ఫోన్‌లో చిత్రీకరించి సామాజిక మాధ్యమాల్లో ప్రచారం చేశారన్నారు. దీంతో దాడికి పాల్పడ్డ యువకులను గుర్తించి ఇరువర్గాలకు చెందిన వారందరినీ అదుపులోకి తీసుకున్నామన్నారు. వారు నిమ్మనపల్లె మండలానికి చెందిన వారని, పట్టణంలో బేల్దారి వృత్తి చేసుకుంటూ జీవనం సాగిస్తున్నట్లు విచారణలో తేలిందన్నారు. చెల్లెలిని వేధింపులకు గురిచేసినందుకు అన్నలు తమ స్నేహితులతో కలిసి ఓ యువకుడిని మందలించడంతో అతడు తమ స్నేహితులతో కలిసి యువతి అన్నలపై దాడిచేశారన్నారు. దీనికి సంబంధించి ఇరుపక్షాలకు చెందిన యువకుల తల్లిదండ్రులను పిలిపించి కౌన్సెలింగ్ నిర్వహించామన్నారు. రోడ్డుపై ఘర్షణకు దిగుతూ, రౌడీయిజం ప్రదర్శించడంపై కఠినచర్యలు తీసుకుంటామన్నారు. పట్టణంలోని ప్రతి కళాశాల వద్ద పోలీసునిఘాను మరింతగా పెంచి భవిష్యత్తులో ఇలాంటి సంఘటనలు జరగకుండా జాగ్రత్తలు తీసుకుంటామన్నారు.

ముగిసిన డాక్టర్ వైఎస్సార్ అడ్వెంచర్ ఫెస్టివల్



విద్యార్థుల రాక్ క్లైంబింగ్

వేంపల్లె : గతనెల 29వ తేదీనుంచి జనవరి 3వ తేదీవరకు నిర్వహించిన డాక్టర్ వైఎస్సార్ అడ్వెంచర్ ఫెస్టివల్ ముగిసినట్లు ఏపీ అడ్వెంచర్ క్లబ్ వ్యవస్థాపకులు కె.రంగారావు పేర్కొన్నారు. బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ వైఎస్సార్ జిల్లాలోని ఇడుపులపాయ చుట్టుపక్కల ప్రాంతాల్లో సహజసిద్ధమైన పింక్ కొండలు ఉన్నాయని, ఇవి ట్రెక్కింగ్, రాక్ క్లైంబింగ్, ర్యాపిలింగ్‌కు అనువుగా ఉన్నాయన్నారు. పాపాఘ్ని నది జల క్రీడలకు అనుకూల ప్రదేశంగా ఆయన వర్ణించారు. అడ్వెంచర్ క్లబ్ ఆఫ్ ఏపీ, పాడా, నెహ్రూ యువ కేంద్రం వారి సహకారంతో గుంటూరు యూత్ హాస్టల్ అసోసియేషన్ ప్రొఫెసర్ కొండయ్య ఆధ్వర్యంలో దాదాపు 15మంది విద్యార్థులు ఈ అడ్వెంచర్ ఫెస్టివల్‌లో పాల్గొన్నారని చెప్పారు. 180అడుగుల కొండపై నుంచి రాపిలింగ్ నిర్వహించామన్నారు. తమకు అన్ని విధాలా సహాయ సహకారాలు అందించిన పాడా ఓఎస్డీ అనిల్‌కుమార్‌రెడ్డి, గండి దేవస్థానం ఈఓ ముకుందారెడ్డి, నెహ్రూ యువ కేంద్రం అధికారి మణికంఠ, వైఎస్సార్‌సీపీ యువ నాయకుడు కావలి కృష్ణ తేజలకు కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం ఈ కార్యక్రమంలో పాల్గొన్న 15 మందికి సర్టిఫికెట్లు అందజేశారు. కార్యక్రమంలో లైఫ్‌టైం అచీవ్‌మెంట్ అడ్వెంచర్ అవార్డు గ్రహీత డేవిడ్ క్రిష్టఫర్, ప్రోగ్రాం డైరెక్టర్ ఆర్.శ్రీధర్‌రాజు, ఆర్పీ అరీఫ్, శిక్షకులు సుధీర్ సింగ్, కౌసిక్, తదితరులు పాల్గొన్నారు.

గండి నిత్యాన్నదానానికి రూ.లక్ష వితరణ



ఆలయ అధికారి ముకుందారెడ్డికి విరాళం అందజేస్తున్న తమ్మినేని చిన్నప్ప

చక్రాయపేట : గండి వీరాంజనేయ స్వామి సన్నిధిలో జరిగే నిత్యాన్న దాన పథకానికి అనంతపురం జిల్లా వాసి రు.1,00,116లు విరాళంగా అందజేసినట్లు ఆలయ సహాయ కమిషనర్ అలవలపాటి ముకుందారెడ్డి తెలిపారు.ఆత్మకూరు మండల కేంద్రానికి చెందిన విశ్రాంత ఉపాధ్యాయుడు తమ్మినేని చిన్నప్ప తన తల్లి దండ్రులు ముత్యాలమ్మ, కంబన్నల జ్ఞాపకార్థం నగదును అందజేశారని చెప్పారు. ఈసందర్భంగా వారిచే ప్రత్యేక పూజలు చేయించి తీర్థప్రసాదాలు అందజేసినట్లు ఆయన తెలిపారు.కార్యక్రమంలో ఆలయ సిబ్బంది రవిచంద్రారెడ్డి, జయచంద్రారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

విజిలెన్స్ అధికారుల దాడులు

రు.7 లక్షల విలువైనబియ్యం పట్టివేత



విజిలెన్స్ అధికారులు స్వాధీనం చేసుకున్న బియ్యం

మైలవరం (జమ్మలమడుగు రూరల్) : మైలవరం మండలం తొర్రివేముల గ్రామానికి వెళ్లే మలుపు వద్ద ఉన్న గొడౌన్ నుంచి లారీలో పీడీఎస్ బియ్యం తరలిస్తుండగా విజిలెన్స్ అధికారులు పట్టుకున్నారు. లారీ డ్రైవర్‌ను అదుపులోకి తీసుకున్నారు. బుధవారం కడప నుంచి వచ్చిన విజిలెన్స్ సీఐ రెడ్డెప్ప, సిబ్బందితో కలిసి దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో 18 టన్నుల పీడీఎస్ బియ్యం స్వాధీనం చేసుకున్నారు. బియ్యం విలువ సుమారు 7 లక్షల రూపాయలు ఉంటుందని విజిలెన్స్ సీఐ తెలిపారు. చంద్రశేఖర్‌రెడ్డి, ప్రతాప్‌లను అరెస్టు చేసి మైలవరం పోలీస్‌స్టేషన్‌లో అప్పగించినట్లు ఆయన చెప్పారు. బియ్యాన్ని జమ్మలమడుగులోని సివిల్ సప్లయి గోడౌన్‌కు తరలించారు. కేసు నమోదు చేసినట్లు విజిలెన్స్ సీఐ తెలిపారు.

వ్యక్తి ఆత్మహత్య

పులివెందుల : పులివెందుల పట్టణంలోని ఎస్ఎస్ఆర్ లాడ్జిలో గంగిరెడ్డి(65) అనే వ్యక్తి బుధవారం ఉదయం ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. పోలీసుల కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. కమలాపురం నియోజకవర్గం వీరపునాయునిపల్లె మండలం పాయసంపల్లె గ్రామానికి చెందిన గంగిరెడ్డి కొంతకాలంగా పులివెందుల పట్టణంలోని ఎస్ఎస్ఆర్ లాడ్జిలో వాచ్‌మెన్ పనిచేస్తుండేవారు. మంగళవారం రాత్రి మద్యం తాగి లాడ్జిలో ఉన్న కిటికీ కడ్డీకి ఉరి వేసుకున్నాడు. అర్బన్ సీఐ రాజు, ఎస్ఐ చిరంజీవి సంఘటన స్థలానికి చేరుకుని పరిశీలించారు.గంగిరెడ్డి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం పులివెందుల ఏరియా ఆసుపత్రికి తరలించారు. పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అప్పగించారు.కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

ఆర్టీపీపీలో నిరసన



ఆర్టీపీపీలో ధర్నా చేస్తున్న ఉద్యోగులు

ఎర్రగుంట్ల : మహారాష్ట్రలో విద్యుత్ సంస్థల ప్రైవేటీకరణను వ్యతిరేకిస్తున్నవారికి మద్దతుగా బుధవారం ఆర్టీపీపీలోని పవర్ హౌస్ గేటు వద్ద జాతీయ జేఏసీ పిలుపు మేరకు ఆర్టీపీపీ జేఏసీ ఆధ్వర్యంలో నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా పలువురు జేఏసీ నాయకులు మాట్లాడారు. ఈ కార్యక్రమంలో ఆర్టీపీపీ ఇంజినీర్లు, ఉద్యోగులు, కార్మికులు పాల్గొన్నారు.

కార్మికుల రెగ్యులరైజేషన్‌పై సీఎం సానుకూలం



సమావేశంలో మాట్లాడుతున్న నారాయణరెడ్డి

ఎర్రగుంట్ల : విద్యుత్ సంస్థలలో పనిచేస్తున్న కాంట్రాక్ట్ కార్మికుల రెగ్యులరైజేషన్ గురించి సీఎం జగన్‌మోహన్‌రెడ్డి సానుకూలంగా ఉన్నట్లు వైఎస్సార్ విద్యుత్ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ (ఆర్టీపీపీ) స్టేట్ జనరల్ సెక్రటరీ నారాయణరెడ్డి అన్నారు. బుధవారం ఆర్టీపీపీలోని ఫ్లెయాష్ గేటు వద్ద కార్మికులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గతంలో ఇచ్చిన హామీని కచ్చితంగా నెరవేర్చాలనే దృఢ సంకల్పంతో ముఖ్యమంత్రి ఉన్నారన్నారు. త్వరలో ఒక నిర్ణయం వస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో యూనియన్ ప్రెసిడెంట్ నాగార్జునరెడ్డి పాల్గొన్నారు.

● జాతి వైరం మరిచి..

అట్లూరు : శునకానికి పిల్లి కనిపిస్తే వెంటాడి వేటాడుతుంది. కానీ.. అట్లూరు మండల పరిధిలోని కోలేటిపల్లె సమీపం ఉన్న పొలంలో శునకాలు, ఓ పిల్లితో సాగిస్తున్న స్నేహం అందరినీ ఆశ్చర్య పరుస్తోంది. అంతేకాకుండా శునకాల్లో ఒకటి పిల్లికి పాలు ఇచ్చిందని వారు తెలిపారు.



